అక్రమ నిర్మాణాలపై కొరడా

- పలు ప్రాంతాల్లో అధికారుల తనిఖీలు
- నిబంధనలకు విరుద్ధంగా వెలసిన నిర్మాణాల కూల్చివేత


దేవేందర్‌నగర్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చి వేస్తున్న దృశ్యం..

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలాల్లో వెలసిన నిర్మాణాలపై గత కొన్ని రోజులుగా మిన్న కుండిపోయిన రెవెన్యూ అధికారులు ఒక్కసారిగా కొరడా ఝులిపించారు. గాజుల రామారావు డివిజన్ దేవేందర్ నగర్ లోని సర్వే నంబర్ 342, 100, 13 ప్రభుత్వ స్థలంలో వెలసిన 25 గదులు, 5 బేస్‌మెంట్లు, 5 గుడిసెలు, నిర్మాణంలో ఉన్న పిల్లర్లను నేలమట్టం చేశారు. మల్కాజ్‌గిరి ఆర్డీఓ శ్యామ్ ప్రకాష్, స్థానిక తహసీల్దార్ రహ్మాన్‌ఖాన్ ఆదేశాల మేరకు గురువారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రజినీకాంత్, రేణుక నేతృత్వంలో ప్రభుత్వ స్థలంలో వెలిసిన నిర్మాణాలను కూల్చివేశారు. దీంతో స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు.

తెరపైకి మళ్లీ కూల్చివేతలు

గాజుల రామారం ప్రభుత్వ స్థలాల్లో వెలుస్తున్న నిర్మాణాలపై గత డిసెంబర్‌లో ‘సాక్షి’ వరస కథనాలపై స్పందించిన జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయా నిర్మాణాలను కూల్చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో అప్పట్లో భారీ పోలీసు బందోబస్తు మధ్య 400 పైగా కూల్చివేయడంతో కబ్జాదారులు వెనక్కి తగ్గారు. ఆ తర్వాత ఎన్నికల విధుల్లో రెవెన్యూ అధికారులు బిజీగా మారడాన్ని అదనుగా తీసుకున్న అక్రమార్కులు మళ్లీ నిర్మాణాలు చేపట్టారు.


అధికారులను అడ్డుకుంటున్న స్థానికులు

అక్రమార్కుల గుండెల్లో గుబులు

గత కొన్ని నెలలుగా నిశ్శబ్దంగా ఉన్న బస్తీల్లో సంబంధిత అధికారులు కూల్చివేతలు చేపట్టడంతో అక్రమ నిర్మాణాల వద్ద స్థలం కొని నివాసాలు ఏర్పరచుకున్న వారు సైతం భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పైసా పైసా కూడా పెట్టి కట్టుకున్న ఇళ్లను ఏమి చేస్తారోనని భయంతో బిక్కుబిక్కు మంటున్నారు.

హెల్త్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి


హెల్త్ మేళా లో పాల్గొన్న కార్పొరేటర్ కొలుకుల జగన్

జగద్గిరిగుట్ట : కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా గురువారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మగ్దుమ్ నగర్‌లో హెల్త్‌మేళా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని, ప్రతి ఒక్కరు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ క్యాంప్‌లో సుమారు 56 మంది పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కొలుకుల జైహింద్, పిల్లి ఆంజనేయులు, బ్రహ్మానంద చారి, రవీందర్ రెడ్డి, సంతోష్, మనోహర్ చారి, శ్రీనివాస్ చారి, అప్పిరెడ్డి, ముఖేష్, మైలారం రాజు, డాక్టర్ . శంకర్, ఏఎస్ఎం. లలిత. ఆశ వర్కర్లు. శ్రీలత గాయత్రి మౌనిక, కళ్యాణి, రత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న శ్రీశైలం యాదవ్

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నామని మున్సిపల్ ఛైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులోని బొల్లారం రోడ్డులో రూ.35 లక్షలు, 6వ వార్డులోని నూజివీడు సీడ్స్ రోడ్డులో రూ. 30 లక్షలతో ఏర్పాటు చేసిన వీధి దీపాలు, 8వ వార్డులో రూ.38 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు, దూలపల్లిలోని 16వ వార్డులో రూ. 46 లక్షలతో ఓపెన్ నాలా, కుమ్మరి చెరువు వద్ద రూ.45 లక్షలతో అభివృద్ధి పనులకు ఆయన స్థానిక కౌన్సిలర్లు భైరి శ్రీవిద్య, పూజారి వసంత, ఎడమ రజిని, తల్లా కృష్ణవేణి, చింతల రవీందర్, చింతల లక్ష్మి, డప్పు కిరణ్‌లతో కలిసి ప్రారంభించారు. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. త్వరలోనే పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు.

ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ రూం ప్రారంభం


ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ రూమ్ ప్రారంభిస్తున్న పాఠశాల ఛైర్మన్ కోటి రెడ్డి

జగద్గిరిగుట్ట : చింతల్ , వెంకటేశ్వర నగర్ లోని బీపీఎస్ ఒలింపియాడ్ పాఠశాలలో గురువారం పాఠశాల చైర్మన్ టీవీ ఆర్ కోటిరెడ్డి ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ రూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్ ఉమా మహేశ్వరి విద్యార్థులతో బొమ్మలు గీయించారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

జగద్గిరిగుట్ట : ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా నిర్మిస్తున్న గదిని రెవెన్యూ అధికారులు గురువారం కూల్చి వేశారు. జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్ప 53వ బ్లాక్ సమీపంలో రెండు రోజులుగా గది నిర్మాణం చేస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో అధికారులు నిర్మాణాన్ని నేలమట్టం చేసారు. మళ్లీ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.


గది నిర్మాణాన్ని కూల్చివేసిన అధికారులు..

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ భరత్‌కుమార్

సుభాష్‌నగర్: డ్రగ్స్‌కు బానిసలై తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూరారం ట్రాఫిక్ సీఐ భరత్‌కుమార్ అన్నారు. గురువారం సూరారంలోని మల్లారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో యాంటీ డ్రగ్ అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన భరత్‌కుమార్ మాట్లాడుతూ కొందరు యువకులు సరదాగా డ్రగ్స్‌ను అలవాటు చేసుకుంటున్నారని, దీని వల్ల వారి ఆరోగ్యాలు పాడవుతున్నాయన్నారు. డ్రగ్స్‌ను వాడినా, విక్రయించిన చట్ట విరుద్ధమని, వాటి పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా వీడియోల ద్వారా డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశం, మల్లారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ డీన్ బీవీఎస్ శాస్త్రి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ వయస్సు తగ్గిస్తే సహించం


మాట్లాడుతున్న చింతల నాగరాజు

కుత్బుల్లాపూర్: కార్మికుల ఉద్యోగ విరమణ వయస్సును తగ్గించేందుకు యత్నిస్తే ఊరుకునేది లేదని ఐఎన్‌టీయూసీ నాయకుడు చింతల నాగరాజు అన్నారు. గురువారం జీడిమెట్ల పారిశ్రామికవాడలోని థర్మోకేబుల్ జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఓ వైపు పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచగా, థర్మోకేబుల్ యాజమాన్యం 56 ఏళ్లకు తగ్గించిందని, ఇది ఏమాత్రం సమ్మతం కాదన్నారు. అదే విధంగా పరిశ్రమ బ్యాలెన్స్ షీట్‌ను చూపించాలని కోరితే యాజమాన్యం వెనుకంజ వేస్తోందని, 20 రోజుల్లోగా బ్యాలెన్స్ షీట్ చూపించాలన్నారు. కార్మికులకు అన్యాయం జరిగితే పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో కంపెనీ డైరెక్టర్ వర్మ, జీఎం రిషి కుమార్, హెచ్‌ఆర్ మేనేజర్ మనోహర్ రెడ్డి,యూనియన్ వైస్ ప్రెసిడెంట్ ఫిలిప్స్, జనరల్ సెక్రటరీ వెంకట్ రెడ్డి, కమిటీ మెంబర్స్ పాల్గొన్నారు

పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య పెంచాలి


జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న లక్ష్మీనారాయణ

కుత్బుల్లాపూర్: పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని కోరుతూ సుభాష్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు గుబ్బల లక్ష్మీనారాయణ గురువారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. డివిజన్ పరిధిలో తగిన సంఖ్యలో సిబ్బంది లేకపోవడంతో రోడ్లపై రోజుల తరబడి చెత్త పేరుకుపోతోందని, వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలు రోగాల బారిన పడకుండా చర్యలు కోవాలని కోరారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

20న బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం

దుండిగల్: గాజులరామారంలోని మహారాజా ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 20న మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వరచారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, ఎంపీ ఈటెల రాజేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యే ఈ సమావేశంలో పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై సమీక్ష, పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలపై నివేదిక, మండల కార్యవర్గ సమావేశాలు తదితర అంశాలపై చర్చ జరుగుతుందని, ఉదయం 10గంటలకు జరిగే సమావేశానికి జంట సర్కిళ్ల, మున్సిపల్, కార్పొరేషన్ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ శ్రీవివేకానంద నగర్ సంక్షేమ సంఘం ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ గురువారం ముగిసింది. అధ్యక్ష పదవికి దేవరింటి మస్తాన్‌రెడ్డి, కాయతి యాదవ రెడ్డి, బొంత హరికృష్ణ వారి మద్దతుదారులతో కలిసి వేరువేరుగా నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి కొండల్‌రెడ్డికి అందజేశారు. అంతకుముందు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. మొయినుద్దీన్, రవి, నెల్లి శ్రీనివాస్‌రెడ్డి, కనకయ్య, శ్రీనివాస్‌యాదవ్, వరప్రసాద్, తిరుపతి, ఏడుకొండలు, శ్రీనివాస్, రాజు, కమ్మరి రామకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు చేపట్టాలి


అన్నదానంలో పాల్గొన్న హన్మంతరెడ్డి, సుధీర్‌రెడ్డి తదితరులు

నిజాంపేట్: పుట్టిన రోజు వేడుకల పేరుతో డబ్బులు వృథా చేయకుండా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. ప్రగతినగర్‌కు చెందిన రవీందర్ మునవడు సహాస్‌చంద్ర జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక సాయిబాబా ఆలయంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి హన్మంతరెడ్డి, ఆలయ ఛైర్మన్ సుధీర్‌రెడ్డిలు హాజరై అన్నదాన వితరణను ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు ఇంద్రజీత్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తులసి దాస్, మధుసూదన్‌రెడ్డి, వీవీ రావు, నారాయణరెడ్డి, అరవింద్, రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్ రాజీవ్ గృహకల్పలోని సాయిబాబా మందిరంలో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ వార్డు సభ్యురాలు లక్ష్మి, కుమార్‌రెడ్డిల కుమారుడు భాను ప్రకాష్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రమణ బాబు, కుమార్ రెడ్డి, మహిళా నాయకురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సేవాభావంతో పని చేయాలి

కుత్బుల్లాపూర్: ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు లాభాపేక్షతో కాకుండా అన్నివర్గాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం జీడిమెట్ల డివిజన్ సుచిత్రలో డాక్టర్ భరత్‌కాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అజుద ఆస్పత్రిని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అజుద ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

చెత్త పారబోస్తున్న ట్రాక్టర్ పట్టివేత


స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ మహాదేవపురం ప్రధాన రోడ్డు సమీపంలో గురువారం ఉదయం ఓ వ్యక్తి టాక్టర్‌లో తీసుకువచ్చిన చెత్తను ఖాళీ చేస్తుండగా వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పట్టుకున్నారు. ఓవైపు కాలనీలో శుభ్రత పాటిస్తుండగా మరోవైపు కొందరు చెత్త పారబోస్తు దుర్గంధ భరితంగా మారుస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో చెత్త పోస్తున్న వాహనాలను పట్టుకుని జీహెచ్‌ఎంసీ అధికారులకు అప్పగించామన్నారు. అయినా కొందరు తమ ధోరణి మార్చుకోవడం లేదని తాజాగా పట్టుకున్న ట్రాక్టర్‌ను అధికారులకు అప్పగిస్తామని తెలిపారు.

అంగన్‌వాడీ ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలి


మాట్లాడుతున్న కీలుకాని లక్ష్మణ్

రంగారెడ్డినగర్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను కల్పించాలని, జీవో 10ను వెంటనే రాష్ట్ర ప్రభుత్వ ఉపసంహరించుకోవాలని సీఐటీయూ కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్ అన్నారు. గురువారం షాపూర్‌నగర్‌లోని కార్యాలయంలో సీఐటీయు మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 65 ఏళ్లు పూర్తయిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ దాదాపు 10 వేల మంది పనిచేస్తున్నారని, వారందరిని ఉత్త చేతులతో ఇంటికి పంపించాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. గతంలో 24 రోజుల పాటు అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె చేపట్టగా అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం లిఖితపూర్వకంగా హామీ ఇచ్చిందన్నారు. పాత జీవో నెంబరు 10ను తిరిగి అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసిందని, దీనికి వ్యతిరేకంగా గత ఏప్రిల్‌లో అంగన్‌వాడీలు ఆందోళనలు చేపట్టారని గుర్తు చేశారు. ఈ నెల 17న మంత్రి సీతక్కను కలిసి అంగన్‌వాడీలు సమస్యలపై వినతి పత్రం అందజేయగా ఆమెను సానుకూలంగా స్పందించారని, ఈ నేపథ్యంలో మరోసారి జీఓ 10 ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యత్నించడం దురదృష్టకరమన్నారు. అంగన్‌వాడీల న్యాయబద్ధమైన హక్కుల సాధనకు చేపట్టబోయే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో సిఐటియు నాయకులు దేవదానం , కరుణాకర్, స్వాతి పాల్గొన్నారు.


టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి ఆధ్వర్యంలో..


మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్..

రుణ మాఫీ సంబురం

కుత్బుల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షలు రుణ మాఫీ చేస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గత ప్రభుత్వం రైతు రుణమాఫీ పేరుతో మోసం చేసిందని, తమ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేరుస్తూ ప్రజా సంక్షేమ పాలన అందిస్తోందని వారు పేర్కొన్నారు.


గండిమైసమ్మ చౌరస్తాలో..

నియామకం


జిల్లా కార్యవర్గ సభ్యులతో మల్లారెడ్డి, ఎంఎస్‌వాసు

కుత్బుల్లాపూర్: బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యవర్గ సభ్యులుగా గొట్టిముక్కల సత్యనారాయణ రాజు(సత్తిబాబు), తిరుపతి నాయుడు, మేడ్చల్ జిల్లా ఇండస్ట్రియల్ కన్వీనర్‌గా గిరిబాబులను నియమిస్తూ బీజేపీ అర్బన్ జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మాజీ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంఎస్ వాసుతో కలిసి గురువారం వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎంపీ ఈటల రాజేందర్, పార్టీ దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కారం చూపుతామన్నారు. వచ్చే గ్రేటర్ ఎన్నికల్లో సత్తా చాటే విధంగా ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగాలని కోరారు.

ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గురువారం కాంగ్రెస్ నాయకుడు సయ్యద్‌రషీద్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ నగర్, శ్రీరామ్‌నగర్‌లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు శ్రీశైలంగౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఇప్పటికే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చాలా వరకు నెరవేర్చడం జరిగిందన్నారు. స్థానిక సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూచించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


కార్యక్రమంలో పాల్గొన్న అధికారి ఇంద్రసేన, స్థానికులు

కూకట్‌పల్లి: దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని యూసీడీ ప్రాజెక్టు అధికారి ఇంద్రసేన అన్నారు. గురువారం కూకట్‌పల్లిలో ఇంటింటికీ తిరిగి ఐ దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డ్రమ్ములు, సిమెంట్ తొట్టెలు, కుండీలు, కూలర్లు, నాలా గుంతల్లో ఉన్న నీటిని పూర్తిగా తొలగించి శుభ్రపర్చుకోవాలని వివరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ సుజాత, ఆర్‌పీలు పాల్గొన్నారు.

నీటిని నిల్వ ఉంచొద్దు..

మూసాపేట: పరిసరాలు, ఇళ్లలో నీటిని నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడూ తొలగించాలని యూసీడీ పీఓ ఇంద్రసేన, మూసాపేట సీఓ మురళి అన్నారు. గురువారం మూసాపేట డివిజన్ పరిధిలో ఇంటింటికీ తిరిగి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. దోమల ద్వారా మలేరియా, డెంగీ, చికెన్ గున్యా తదితర వ్యాధులు వ్యాప్తి చెందుతాయని వివరించారు. దోమలను పిల్ల దశలో నిర్మూలించటం ద్వారా వాటిని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ మురళి, ఆర్‌పీలు పాల్గొన్నారు.

దోమల నివారణలో భాగస్వాములు కావాలి

ఓల్డ్‌బోయిన్‌పల్లి: దోమల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని ఎంటమాలజీ అధికారులు అన్నారు. డివిజన్‌లో ఎంటమాలజీ అసిస్టెంట్ సూపర్‌వైజర్ ఉషా, శానిటేషన్ సూపర్‌వైజర్ మనోహర్‌రెడ్డి, ఎంటమాలజీ సూపర్ వైజర్ స్వామి ఆధ్వర్యంలో ఓల్డ్ బోయిన్‌పల్లి హైటెక్ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం భవానీనగర్‌లో స్వయం సహాయక సంఘాలు, ఆర్పీలతో కలసి ప్రజలకు దోమల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిపాల్, బుజ్జి, చైతన్య, ప్రకాశ్, సంపత్, అరుణ, ఈశ్వరమ్మ, దుర్గ, శాంతి, సౌజన్య, సుప్రియ, అరుణ, రాజకుమారి, అర్చన, దేవి పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


రమేష్ (ఫైల్)

మోతీనగర్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి జరిగింది. సీఐ సామల వెంకటరెడ్డి వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం, దుష్యార్ గ్రామానికి చెందిన గంట్యాడ రమేష్ (38) పది సంవత్సరాల క్రితం రాణాప్రతాప్ నగర్‌కు వచ్చి ఏసీ టెక్నీషియన్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు తాళలేక బుధవారం రాత్రి ఉరేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుల బదిలీ.. సన్మానం

అల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని రిక్షాపుల్లర్స్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల బదిలీ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. బదిలీ అయిన హెచ్‌ఎం బి. జయరాజు, ఉపాధ్యాయులు జి ఆంజనేయులు, పి. విజయకుమారి, ఏ. సునీత, ఏ. ముకుందారెడ్డి, పీఎస్ సబిత, సృజనను సత్కరించారు. అనంతరం పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు.